క్లుప్తంగా

నేడు కోర్టులో వైద్యశిబిరం

భైంసాటౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరం ఉదయం 10:30 గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రక్తపరీక్షలు, సాధారణ వైద్యపరీక్షలు, హోమియోపతి, ఆ యుర్వేద వైద్యసేవలు, చర్మ సమస్యలకు పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కో రారు.

జనావాసాల్లోకి నీలుగాయి

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీ సమీపంలో జనావాసాల్లోకి శుక్రవారం నీలుగాయి సంచరించింది. అటవీ ప్రాంతంలో నుంచి జనావాసాల్లోకి వచ్చిన నీ లుగాయిని కుక్కలు తరుమడంతో కాలనీవాసులు అటవీ అధికారులకు సమాచారం ఇ చ్చారు. వారు వచ్చి నీలుగాయిని ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

అందుబాటులో ఎరువులు

ముధోల్: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యాలయంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. పోటాష్ బస్తా ధర రూ.1880, 20–20 బస్తా రూ.1280 ఉందని..కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకాలతో వచ్చి ఎరువులు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఎరువు కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కుంటాల: మండలంలోని దౌనెల్లి గ్రామంలో భైరి భీమేశ్‌కు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. శుక్రవారం ఉదయం మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో ఉన్న 63/11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు. లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రాజు, లైన్‌మెన్ శ్రీనివాస్, సిబ్బంది శ్రీనివాస్ వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు.

అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు

భైంసాటౌన్: నియోజకవర్గంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.84లక్షల నిధులు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. భైంసా మండలంలోని సుంక్లి, కుంటాల మండలంలోని లింబ(కె) ,లోకేశ్వరం మండలం రాజురా, కుభీర్, తానూరు, బాసర, ముధోల్ మండలకేంద్రాల్లో అంగన్‌వాడీ కేంద్రా ల భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న టీం సభ్యులు

కడెం: మండలంలోని పలు గ్రామాల్లో ఐదేళ్లలో జరిగిన ఉపాధిహామీ పనులను శుక్రవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు అరవిందమిత్ర, గోవిందరాజు పరిశీలించారు. ఎక్కువగా పనులు జరిగిన నవబ్‌పేట్, కొత్తమద్దిపడగ పంచాయతీల్లో ఫారంపాండ్, చిన్న నీటికుంటలు, అటవీ భూముల్లో కందకాల పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్డీవో నాగవర్ధన్, సీఆర్డీ టెక్నికల్ పర్సన్ అంబేడ్కర్, డీఆర్పీ గంగాప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీవో అరుణ, ఏపీవో జయదేవ్, ఉపాధిహామీ, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులున్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

నిర్మల్‌టౌన్: నిర్మల్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మేకల శ్రీనివాస్ యాదవ్, సెక్రెటరీగా వేణుగోపాలస్వామి, ట్రెజరర్‌గా సురేశ్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్ గుప్తా, వెంకటరమణారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా లక్ష్మీనారాయణ గౌడ్, లక్కడి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు 13 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈనెల 27న జిల్లాకేంద్రంలో ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన పేర్కొన్నారు.

'విద్యాసంస్థల్లో వ్యాపారం అడ్డుకోవాలి'

భైంసాటౌన్: అధిక ధరలకు పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నాయని.. ఆ వ్యాపారాన్ని అడ్డుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో సుభాశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తుల సీరాం హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు గోవింద్, శివకుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..!



కమల థియేటర్ వద్ద రోడ్డు మధ్యలో గుంత



గుంతలో ఇరుక్కున్న కారు

భైంసాటౌన్: పట్టణంలోని పలుచోట్ల కల్వర్టులపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. వాటిని గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో చేరుతున్నారు. స్థానిక కమల థియేటర్ సమీపంలో, ఓ ప్రైవేట్ ఆస్పత్రి పక్కన కల్వర్టుపై భారీ గుంత ఏర్పడింది. అలాగే పట్టణ పోలీస్‌స్టేషన్, మహాలక్ష్మి ఆలయానికి వెళ్లే మార్గంలోనూ కల్వర్టు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. శుక్రవారం కమల థియేటర్ వద్ద కల్వర్టుపై ఉన్న గుంతలో ఓ కారు టైరు ఇరుక్కుంది. దానిని బయటకు తీసేందుకు వాహనదారులు తీవ్రంగా శ్రమించారు. ద్విచక్రవాహనదారులు ఈ గుంతలను గమనించకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. రాత్రి వేళ ఈ ముప్పు మరింత ఎక్కువ. అధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

ఈ బడిని పట్టించుకోరూ..

భైంసారూరల్: మండలంలోని కుంసర ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. దీంతో దుర్వాసన రావడంతోపాటు దోమలు పెరుగుతున్నాయి. ఇప్పటికే అసంపూర్తి పనులతో గోడలు లేని స్లాబ్ కింద తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



పాఠశాలలో చెత్త, స్లాబ్ కింద విద్యార్థులు

రోడ్డు గిట్లుంటే ప్రాణాలు పోవా?



కుభీర్: మండలకేంద్రం నుంచి వివేకానంద చౌరస్తా వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు 500 మీటర్ల మేర దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మూడేళ్లుగా విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం గుంతల్లో మొరం నింపి తమ ప్రాణాలను కాపాడాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

'కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి'

తానూరు: పార్టీకి కార్యకర్తలే బలమని.. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం తానూరు ఎంఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ముధోల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మన ప్రభుత్వం ముధోల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా గ్రామాల్లో నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. గ్రామ, బూత్ స్థాయి కమిటీ పునర్వ్యవస్థ, స్థానికసంస్థల ఎన్నికలపై కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు చంద్రశేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాలచారి, విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావ్‌పటేల్, మండలాధ్యక్షుడు పుండలిక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాసరలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు, పక్కన శ్రీహరిరావు, నేతలు

బాసరను అభివృద్ధి చేస్తాం..

బాసర: బాసర ఆలయ మాస్టర్‌ప్లాన్ అమలు చేయడంతోపాటు పూర్తిస్థాయి ఈవోను బాసర ఆలయానికి నియమించేలా కృషి చేస్తానని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి పేర్కొన్నారు. తిరిగి వెళ్లిన నిధులు తెచ్చి బాసరను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. పార్టీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. నారాయణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధిని విస్మరించిందని.. యాదాద్రి, వేములవాడ తరహాలోనే బాసరను రూ.42 కోట్లతో అభివృద్ధి చేయాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రమేశ్ ఉన్నారు. అంతకుముందు కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు.

దత్తసాయి ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన శ్రీ దత్త సాయి ఆలయ తృతీయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో గోపూజ, మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, నవగ్రహ పూజ, అష్టోత్తర కలశాభిషేకం, హోమం, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ తదితర పూజాది కార్యక్రమాలు జరిపించారు. సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి యజ్ఞాది హోమ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయిదీక్ష సేవాసమితి సభ్యులు లింగారెడ్డి, నారాయణరెడ్డి, ప్రకాశ్‌గౌడ్, రేణుకదాస్, కోల శంకర్, జనార్దన్, అజయ్, తిరుపతి శ్రీను, రేఖ, ఈవో రమేశ్ పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డి, భక్తులు

భారీగా మత్తు పదార్థాలు పట్టివేత

- రెండు కార్లు సీజ్, ఐదుగురి అరెస్టు

నిర్మల్‌రూరల్: మహారాష్ట్ర నుంచి జగిత్యాలకు అక్రమంగా తరలిస్తున్న రూ.8 లక్షల విలువైన నిషేధిత మత్తు పదార్థాలు క్లోరోహైడ్రేట్స్, అలప్రోజోలంను శుక్రవారం నిర్మల్‌రూరల్ మండలం చిట్యాల వద్ద జాతీయ రహదారిపై రాష్ట్ర టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్‌శాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపిన వివరాల ప్రకారం .. జగిత్యాల జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు తెల్ల కల్లులో కలిపే మత్తు పదార్థాలైన క్లోరోహైడ్రేట్, అల్ప్రోజోలంను మహారాష్ట్రలోని థానే జిల్లా లింబావాలి గ్రామం నుంచి రెండు కార్లలో జగిత్యాలకు తరలిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు చిట్యాల గ్రామ సమీపంలో పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా 425 కిలోల క్లోరోహైడ్రేట్స్ 1100 గ్రాముల అల్ప్రోజులాం లభించింది. వాటిని సీజ్ చేసి అక్రమంగా తరలిస్తున్న బుర్ర రమేశ్‌గౌడ్, బాసుపల్లి రామాగౌడ్, బుర్ర రాజశేఖర్, కోటగిరి రాజన్న, ఇల్లందుల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామని సీఐ తెలిపారు. వారి నుంచి ఐదు ఫోన్లు, రెండు వాహనాలను జప్తు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ఇందులో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ ఎస్సై బాలరాజ్, నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, సిబ్బంది వెంకటేశ్, హరీశ్, ఇర్ఫాన్, సాయన్న, రషీద్‌ఖాన్, కౌశిక్, నితిన్ ఉన్నారు.



పట్టుకున్న మత్తు పదార్థాలు, నిందితులను చూపుతున్న అధికారులు

తాగి వాహనాలు నడిపితే చర్యలు

ముధోల్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బిట్ల పెర్సిస్ అన్నారు. శుక్రవారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాల ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

ధర్మారంలో డ్రైడే

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ అంగన్‌వాడీ టీచర్‌తో కలిసి పంచాయతీ సిబ్బందితో మురుగుకాల్వలను శుభ్రం చేయించారు. మురికి కాలువల పక్కన నీటిని పంచాయతీ సిబ్బంది చేత తొలగింపజేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, ఆత్మ డైరెక్టర్ రవి, నాయకులు సురేశ్, చిన్న రాంరెడ్డి, సత్యపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలో పైపులైన్ దెబ్బతినడంతో తాగునీటి సమస్య తలెత్తింది. స్పందించిన ఎంపీడీవో రాధ శుక్రవారం బాబాపూర్‌లో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఇందులో ఎంపీవో అమీర్‌ఖాన్ ఉన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బా ధ్యత అని ఎంపీవో ఎంఏ రహీంఖాన్ పేర్కొన్నారు. డ్రైడే సందర్భంగా శుక్రవారం కుంటాలలో గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పలు ఇళ్లల్లో నిల్వనీటిని పారబోయించారు. వైద్యురాలు శ్రుతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మ చైర్మన్ల ప్రమాణ స్వీకారోత్సవం

తానూరు: మండలకేంద్రంలోని రైతువేదికలో భైంసా ఆత్మ చైర్మన్‌గా సిద్దంవార్ వివేకానంద, ముధోల్ ఆత్మ చైర్మన్‌గా గన్ను నర్సారెడ్డితోపాటు పలువురు డైరెక్టర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వివేకానందను డీఏవో అంజిప్రసాద్.. నర్సారెడ్డిని ఏడీఏ వినయ్‌బాబు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు, నారాయణ్‌రావ్ పటేల్, వేణుగోపాలచారి, విఠల్‌రెడ్డి, పార్టీ పరిశీలకులు చంద్రశేఖర్, మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భైంసా ఆత్మ చైర్మన్ వివేకానంద



ముధోల్ ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



కుంటాలలో యోగా సాధనలో విద్యార్థులు

నిర్మల్‌టౌన్:యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు అన్నపూర్ణ అన్నారు. జిల్లా క్రీడల శాఖ, ఈఎస్ఎస్ఈ హెల్తటెక్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌భవన్‌లో యోగా దినోత్సవం నిర్వహించగా వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా స్థాయి సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించగా వాసవి పాఠశాల విద్యార్థి శ్రీషిత్ బహుమతి అందుకున్నాడు. కార్యక్రమంలో గురువులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ముందస్తు యోగా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ కాసు నవీన్‌కుమార్ వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైక్‌ను ఢీకొన్న స్కూటీ.. ముగ్గురికి గాయాలు

లక్ష్మణచాంద: మండలకేంద్రం సమీపంలో బైక్‌ను స్కూటీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే లక్ష్మణచాందకు చెందిన వెంకటరమణ కేజీబీవీ సమీపంలోని తన చేనుకు బైక్‌పై వెళ్తున్నాడు. మండలంలోని పొట్టపెల్లికి చెందిన ఓ మహిళ స్కూటీపై చిన్నారితో లక్ష్మణచాంద నుంచి ఇంటికి వెంకటరమణ బైక్ వెనకాల వస్తోంది. కేజీబీవీ దాటిన తర్వాత వెంకటరమణ తన బైక్‌ను చేను వైపు తిప్పగా.. వెనుక వస్తున్న మహిళ స్కూటీతో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటరమణకు తలకు గాయాలయ్యాయి. మహిళ , చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వెంకటరమణను నిర్మల్ ఏరియా ఆసపత్రికి తరలించారు. ఈఎంటీ దీపక్, పైలట్ రాజన్న ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ లైన్‌లో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ద్యాగవాడకు చెందిన మరుకుంట మనోజ్ బైక్‌పై స్నేహితుడితో కలిసి వెళ్తుండగా తిరుమల థియేటర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మనోజ్‌కు తీవ్ర గాయాలవగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మనోజ్ తండ్రి శ్రీనివాస్ జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లగా కొడుకుకు ప్రమాదం జరిగిన విషయం తెలిసి శుక్రవారం ఉదయం దుబాయ్ నుంచి బయలుదేరాడు.

తపాలా సేవలపై అవగాహన

నిర్మల్‌టౌన్: తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ నిర్మల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తపాలాశాఖ కార్యాలయంలో డీసీడీపీ టాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ అందిస్తున్న వివిధ రకాల పథకాలు, వడ్డీరేట్లు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం 38 కొత్త అకౌంట్లను ఓపెన్ చేయించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

23న ఒలింపిక్ రన్ విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: ఈనెల 23న జిల్లా కేంద్రంలో జరిగే ఒలింపిక్ రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్రీడలశాఖ కార్యాలయంలో ఒలంపిక్ రన్ నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒలంపిక్ రన్‌లో అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, పాల్గొనాలని కోరారు. ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పేట అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి భోజన్న, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్, పీడీలు శ్రీనివాస్, రమణ ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



శశివర్ధన్ యోగా విన్యాసం

కడెం: మండలంలోని అల్లంపల్లి గ్రామంలోని జీయర్ గురుకులం పదవ తరగతి విద్యార్థి బండి శశివర్ధన్ యో గా లో రాణిస్తున్నాడు. .రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శశివర్ధన్ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ ఏడాది జనవరిలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నాడు.

ముగిసిన భూభారతి రెవెన్యూ సదస్సులు

సోన్: భూభారతి రెవెన్యూ సదస్సులు ముగిశాయని.. మండలంలోని భూభారతి రెవెన్యూ సదస్సుల్లో 720 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతువేదికలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్మల్ ఆర్డీఓ రత్నకల్యాణి పరిశీలించారు. న్యూవెల్మల్ గ్రామ రైతుల కోసం మరో రెండు రోజులు తహసీల్దార్ కార్యాలయంలో డీ1, సాదా బైనామాలకు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్ఐ అలీ మున్నిసా, జ్ఞానేశ్వర్, వీడీసీ చైర్మన్ జిలకర వేణు, రైటర్ బట్టు గంగాధర్, రోడ్డ రాజేశ్వర్, మల్లయ్య పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఆర్డీఓ రత్నకల్యాణి

మొక్కలు నాటి సంరక్షించాలి

ఖానాపూర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కార్యదర్శి సయ్యద్ అజాంతో కలిసి పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సారంగపూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం సీపీఐ 4వ జిల్లా మహాసభ పోస్టర్లను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భుక్యా రమేశ్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వచ్చే నెల 6న గాంధీ పార్కు నుంచి పెన్షనర్ల సంఘ భవనం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక, కర్షక సోదరులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు'

ఖానాపూర్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉట్నూర్‌కు తరలించారని బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు కొందరు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, రుణమాఫీ పథకాలను చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నిమ్మల రమేశ్, ఎంఏ మాజిద్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, షబ్బీర్‌పాషా, గంగనర్సయ్య, తోట సత్యం, యూసుఫ్‌ఖాన్, షౌకత్‌పాషా, శంకర్, రాజునాయక్, సలీంఖాన్, నయీం, జూని, ముషీర్, సత్యనారాయణ, రమేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

పట్టీలు దొంగతనం.. పట్టించిన సీసీఫుటేజీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో నిద్రిస్తున్న ఓ మహిళ కాలు పట్టీలు దొంగతనం చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్‌రూరల్ మండలం అనంతపేట్ గ్రామానికి చెందిన బీమాయి అనే మహిళ సమీప బంధువులు డెలివరీ కావడంతో ఆసుపత్రికి వచ్చింది. గురువారం రాత్రి ఆసుపత్రి ఆవరణలోనే నిద్రించింది. ఇది అదునుగా భావించిన ఓ మహిళ బీమాయి కాళ్లకు ఉన్న వెండి పట్టీలు చాకచక్యంగా దొంగిలించి పరారైంది. శుక్రవారం ఉదయం కాళ్లకు పట్టీలు కనిపించకపోవడంతో ఆసుపత్రిలోని సూపరింటెండెంట్‌కు జరిగిన విషయం తెలియజేసింది. దీంతో సూపరింటెండెంట్ వెంటనే అక్కడున్న సీసీ ఫుటేజీ పరిశీలించి దొంగతనం చేసిన మహిళను గుర్తించి వెండి పట్టీలను బాధితురాలికి అప్పగించారు. దీంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.